రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - రాయచోటి

ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజంపేటలోని నగరవరంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు జరగనున్నాయని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఈనెల 5న జిల్లాలో నిర్వహించబోయే ప్రపంచ పర్యావరణ వేడుకలు, ఈ నెల 7న నిర్వహించబోయే యోగా కార్యక్రమంపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 5 లక్షల మొక్కలు నాటుతారని పేర్కొన్నారు. ఈ నెల 7న అన్నమాచార్యులు, ఆయన రచించిన కీర్తనలే థీమ్‌గా యోగా నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యోగా కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పాల్గొన్నారు.

సారా రహిత జిల్లానే లక్ష్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి- రాయచోటి

అన్నమయ్య జిల్లాను నాటుసారా రహితంగా రూపొందించడమే లక్ష్యంగా సమన్వయంతో కృషిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో 'నవోదయం 2.0' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నాటు సారా నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటు సారా పై ప్రజల్లో అవగాహన కలిగించి నాటు సారాను పూర్తిగా నిర్మూలించడానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ మేరకు నాటుసారా అమ్ముడం, తయారు చేయడం, రవాణా చేయడం వంటివి చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. జిల్లాలో ముఖ్యంగా గిరిజన తాండాలు ఉన్న మండలాలలో నాటు సారా తయారు చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. జిల్లాలో మొత్తంగా నాటు సారా తయారు చేసే 70 గ్రామాలను గుర్తించగా, ఇందులోఏ కేటగిరిలో ఆరు గ్రామాలు, బిలో 32, సి కేటగిరీలో 30 చొప్పున గ్రామాలు ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ వారు గుర్తించారన్నారు. ఈ 70 గ్రామాలలో 40 గ్రామాలలో నాటు సారాను పూర్తిగా అరికట్టడం జరిగిందని, ఇంకనూ 28 గ్రామాలలో నాటు సారా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. నాటు ద్వారా తయారీ మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి నాటు సారా రహితంగా రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. నవోదయం 2.0 కార్య క్రమం అమలైనప్పటి నుంచి ఇప్పటివరకు 191 కేసులు నమోదు చేయగా, 169 మందిని అరెస్ట్ చేశారని, 11224 లీటర్ల నాటు సారా సీజ్ చేయడంతోపాటు 35675 లీటర్ల నాటు సారాను దొర్లించామని చెప్పారు. 525 మందిని బైండోవర్ చేశారని, 9 మంది పై పీడీ యాక్ట్ నమోదు చేశారని పేర్కొన్నారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా నాటుసారా వల్ల కలిగే దుష్ప్రభావాలను గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలలో విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం ఐదు భాగాలుగా విభజించి తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలు జారీ చేసింది అన్నారు. ఎ, బి కేటగిరీలోని గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శించి గ్రామ సభలు నిర్వహించి నాటు సారా తయారు చేయడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఎస్‌హెచ్‌ఒ, తహశీల్దార్, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి సమన్వయంగా గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. నిరంతరం నాటు సారా వృత్తి నుంచి బయటికి రాని వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే ఆ వృత్తిలో ఉన్నవారు బయటికి వచ్చేలా కళాజాతా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాటు సారా తయారు చేసేవారు తిరిగి మరలా వృత్తిలోకి వెళ్లకుండా వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన రుణాలు ఇప్పించడం, ఏదైనా అంశంలో నైపుణ్యం ఉన్నవారికి తగు అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించి నాటుసారా తయారు చేసే వారికి బెల్లం అమ్మకాలు కొనసాగించకుండా అవగాహన పెంచాలన్నారు. అన్ని శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేస్తేనే ఇది సాధ్యం అవుతుందని, ఆ మేరకు అధికారులందరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. నాటుసారా పై 14405 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదులు చేయవచ్చునని, ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు. అంతకు ముందుగా నవోదయం 2.0 కార్యక్రమ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. ముఖ్యంగా వాయల్పాడు, మదనపల్లి, పీలేరు, మొలకలచెరువు, కోడూరు మండలాల్లోని గిరిజన తండాలు అటవీ ప్రాంతాలలో నాటుసారా తయారు చేస్తున్నారని వీరిపై ఎక్సైజ్, అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖల ద్వారా ప్రత్యేకమైన పర్యవేక్షణ చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, సూపరింటెండెంట్ జి. మధు సూదన్, సహాయ సూపరింటెండెంట్ వై.జోగేంద్ర, ఎల్డిఎం, పోలీస్, డ్వామా, డిఆర్‌డిఎ, బీసీ, ఎస్టీ, పంచాయతీ, అటవీ శాఖల అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

- వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆధునిక సాంకేతిక పద్ధతులతో రైతులు అధిక దిగుబడులు సాధించ వచ్చునని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి పేర్కొన్నారు. కడప ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ఓబనపల్లె, విపిఆర్ కండ్రిక గ్రామాలలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ సుమతి మాట్లాడుతూ రైతులు విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించాలని సూచించారు. శాస్త్రవేత్తల అధికారుల సలహా మేరకు ఎరువులు, మందులు వాడి పంట ఖర్చులు తగ్గించు కోవడమే కాకుండా నేల, వాము కాలుష్యంతో పాటు మన ఆరోగ్యాన్ని కూడా సంరక్షించుకో వచ్చునని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు తామర పురుగుల సమస్య అధికంగా ఉందని తెలిపారని అందుకు తామర పురుగుల సమగ్ర యాజమాన్యం కోసం వేసవిలో లోతు దుక్కులు చేసుకోవాలని సూచించారు. పంట చుట్టూ నాలుగు వరుసలతో సజ్జ లేదా జొన్నను రక్షక పంటగా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ టి.మహేష్ బాబు, డాక్టర్ ఎస్ మానస, ఆర్ గిరీష్‌కుమార్, మండల ఉద్యాన అధికారి భాస్కర్, బాలసుబ్రమణ్యం, బిటిఎం ఆత్మ పథకం గ్రామ ఉద్యాన సహాయకులు లక్ష్మీనారాయణ, రైతులు పాల్గొన్నారు. **కలికిరి :** కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల పర్యవేక్షణలో మేడికుర్తి గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ అవగాహన కార్యక్రమం ఆరవ రోజు నిర్వహించారు. కెవికె సమన్వయకర్త డాక్టర్ కె. మంజుల మాట్లాడుతూ విత్తన శుద్ధి, జీవన ఎరువుల వాడకం, వేరుశనగ, వరి, కంది రకాల గురించి అంటు మొక్కల గురించి, భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి వివరించారు. వ్యవసాయ అధికారి మమత పచ్చిరొట్టె ఎరువుల వాడకం, ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు. పశు వైద్యాధికారి డాక్టర్ గిరినాథ్ నట్టల నివారణ, టీకాల వేయించడం, పాడి రైతులకు ఉపయోగపడే పథకాల గురించి, దాణా ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఆత్మ, బిటిఎం అమృత్ కుమార్ ఆత్మ ద్వారా అందించే సేవల గురించి తెలిపారు. ఉద్యాన విశ్వ విద్యాలయం నుంచి వచ్చిన డాక్టర్ రాజనాయక్ జామ తోటలు, అంజీర, అల్లనేరుడు లాంటి పంటలను ప్రోత్సహించాలని, బొప్పాయిలో తెగుళ్ళ యాజమాన్యం, టమోటలో ఎరువుల వాడకం మరియు గులాబి, కనకాంబరం, సంపంగిలో ఈ ప్రాంతానికి అనువైన రకాల గురించి వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుమతి

వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ జగన్

- టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు

సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ పేటెంట్ రైట్ ఉన్న ఒకే ఒక వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి అని రాజంపేట టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. మంగళవారం రాజంపేట టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెన్నుపోటు అంటే జగన్‌కు అన్ని హక్కులు ఉన్నాయని, ఎందుకంటే ఆస్తి కోసం తల్లి, చెల్లినీ కోర్టుకు ఈడ్చి వెన్నుపోటు పొడవడం, సొంత బిడ్డలా చూసుకున్న బాబాయ్‌కి గొడ్డలి పోటుతో వెన్నుపోటు పొడిచారన్నారు. తన స్వార్థం కోసం తనను నమ్ముకున్న వాళ్ళను, అధికారులను జైలుకు పంపేలా అవినీతితో వెన్నుపోటు పొడిచారని తెలిపారు. అధికారం కోసం నిరుద్యోగులకు మెగా డిఎస్‌సి అంటూ నిరుద్యోగులకు వెన్నుపోటు పొడవడం, మద్య నిషేధం అంటూ మహిళలకు వెన్నుపోటు పొడిచి మద్యం ద్వారా వేల కోట్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. నమ్మి ఓట్లు వేసిన రాష్ట్ర ప్రజలకు, రాజంపేట ప్రజలకు వెన్నుపోటు పొడిచి అన్నమయ్య డ్యాంను నిర్మించకుండా కాలయాపన చేశారన్నారు. ఇలా నమ్ముకున్న నాయకులను, కుటుంబ సభ్యులను, అధికారులను అందరిని వెన్ను పోటు పొడిచి ఐదేళ్ల అధికారం అనుభవించి వెన్నుపోటును గుర్తించిన ప్రజల చేతుల్లో ఘోర ఫలితాలు రుచి చూసి నేడు ప్రజా పాలనను ఎదుర్కోలేక వెన్నుపోటు అంటూ వెన్నుపోటు బ్రాండ్ అంబాసిడర్ డ్రామా చేయడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నందలూరు మండల టిడిపి అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, రాజంపేట మండల ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ రాజు, ఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌ఛార్జి కొల్లి రెడ్డయ్య నాయుడు, టిడిపి నాయకులు గీతాంజలి రమణ, నందలూరు క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య, యువ నాయకులు పరుశురాం నాయుడు, తాటి సుబ్బరాయుడు, రాంనగర్ నరసింహ, కోటయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్ : ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చరిత్ర వైసిపి అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి దేనని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ విమర్శించారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అన్నివర్గాలకు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారన్నారు. జగన్ మోహన్ రైతులకు బిందు తుంపర్ల వ్యవసాయంపై సబ్సిడీని తొలగించి అన్యాయం చేశారని, ఉద్యోగులకు పిఆర్‌సి ఇస్తామని ఇవ్వకుండా వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. గత ఎడాది జరిగిన శాసనసభ ఎన్నికల్లో జూన్ 4న ఫలితాలు వెలువడితే, ఎపి ముఖ్య మంత్రిగా చంద్రబాబు నాయుడు జూన్ 12వ తేదీన ప్రమాణ స్వీకారం చేశారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో వైసిపికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పునివ్వడం జరిగిందని, దీనిని జీర్ణించుకోలేని జగన్ వెన్నుపోటు దినంగా నిరసన తెలపడం అర్థరహితమన్నారు. వాలంటీర్లకు ఉద్యోగాలు పెర్మనెంట్ చేస్తామని చేయకుండా వారికి వెన్నుపోటు పొడిచారని, పోలవరం పూర్తి చేయకుండా ప్రజలను మభ్యపెట్టి నందుకు ప్రజలు ఇంటికి సాగ నంపారన్నారు. మూడు రాజధానులు అని చెప్పి ఒకటి పూర్తి చేయలేని దుస్థితి వైకాపాదన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని చేయలేక పోయారని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు రామాంజులు, ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు : డిఇఒ

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - రాయచోటి

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని బోధనలో నూతనత్వంతో మెరుగైన ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక డైట్ విద్యా కేంద్రంలో ప్రారంభమైన డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్‌ల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో అకడమిక్ కేలండర్ ప్రకారం విద్యా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అందుకోసం అకడమిక్ కేలండర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించు కోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాల స్థాయిలో నిర్వహించే అన్ని పరీక్షలకు ఒక్కొక్క సబ్జెక్టుకు ఒక మూల్యాంకన పుస్తకాన్ని విద్యార్థులకు అందిస్తారని చెప్పారు. అందులోనే విద్యార్థులు సమాధానాలను రాయవలసి ఉంటుందన్నారు. పాఠ్య పుస్తకాలలోని కఠిన భావనలపై అవగాహన పెంపొందించుకునేందుకు ఉపాధ్యాయుల కరదీపిక తోడ్పడుతుందన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించేందుకు 'లీప్ యాప్'ను ప్రవేశ పెట్టారని చెప్పారు. జిల్లా రిసోర్స్ పర్సన్‌లు అందరూ శిక్షణ పొందిన తర్వాత మండల, డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వవలసి ఉంటుందన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్స్ అందరూ సద్వినియోగం చేసుకో వాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ సుజన్, డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు, డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, డిసిఇబి కార్యదర్శి నాగముణి రెడ్డి, ప్రధానో పాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, జిల్లాలోని 274 మంది తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపూడి తిరుపతిరావు

సహకార కేంద్ర బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : రిటైర్డ్ మేనేజర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వినియోగదారులు సహకార కేంద్ర బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ గొల్లపూడి తిరుపతి రావు అన్నారు. మదనపల్లె సహకార కేంద్ర బ్యాంకులో మంగళవారం వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం బ్యాంకులో అమలు అవుతున్న వివిధ రకాల డిపాజిట్లు, వాటిపై అందే వడ్డీలను గురించి, డిపాజిట్ల భద్రత, బీమా గురించి, బ్యాంకులో అమలు చేస్తున్న వివిధ రకాల రుణాలు గురించి తిరుపతిరావు వివరించారు. వినియోగదారులకు బ్యాంకు లేదా సిబ్బంది నుంచి గాని ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులో లాకర్ సౌకర్యం కలదని, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా డిపాజిట్లపైన అదనంగా 0.50 శాతం వడ్డీ పొందే సౌలభ్యం కలదని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ మేనేజర్లు ఎం.శివశంకర్, ఎస్.నాగరాజ్, బ్యాంకు మేనేజర్ సి.సోమశేఖర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, డి.వాణి, ఎ.పవిత్ర, ఎం.షర్మిల, పి.జయంతి, రమణ, వినియోగదారుల ప్రతినిధి సిద్దయ్య శెట్టి, వినియోగదారులు పాల్గొన్నారు.

మదనపల్లె విద్యార్థికి ఉత్తమ ర్యాంకు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జెఇఇ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో పట్టణానికి చెందిన విద్యార్థి సత్తాచాటాడు. వేదహర్షిత్‌రెడ్డి జెఇఇ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 2,628 ర్యాంకు, ఇడబ్ల్యూఎస్ కేటగిరిలో 244 ర్యాంకుతో మెరిశాడు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు మొరుంపల్లె సహదేవరెడ్డి, రజినీ మాట్లాడుతూ తమ కుమారుడు 10వ తరగతి వరకు నీరుగట్టువారిపల్లెలోని బ్రిలియంట్ హైస్కూల్ నందు చదివి పదవ తరగతిలో 579 మార్కులు సాధించాడని, అనంతరం తిరుపతి నారాయణ విద్యా సంస్థల్లో ఇంటర్మీడియట్ చదివి 985 మార్కులతో నిలిచాడన్నారు. చిన్నతనం నుండి వేదహర్షిత్‌రెడ్డికి చదువు పట్ల ఎంతో మక్కువన్నారు. తాము ఎంతగానో ప్రోత్సహించామన్నారు. భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు సాధించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. పట్టణంలోని ప్రముఖులు సదరు విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించి, బ్రిలియంట్ హైస్కూల్‌లో సాధారణ విద్యార్థులచే అసాధారణ ఫలితాలు సాధిస్తున్నారనడానికి వేద హర్షిత్ రెడ్డి జాతీయ ర్యాంకే నిదర్శనమన్నారు.

పేద ప్రజల గుండెచప్పుడు 'సుగవాసి'

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి-రాయచోటి

పేద ప్రజల గుండెచప్పుడు, ప్రజా నాయకుడు, పెద్దాయనగా పిలిపించుకున్న మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ రాయుడు బడుగు, బలహీన వర్గాల ఆశాకిరణమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో స్వర్గీయ సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభను స్థానిక ప్రజలు, నాయకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కె.రామాపురం ప్రజల ఆహ్వానం మేరకు హాజరైన ప్రసాద్‌బాబు కొత్తపేట రామాపురం, మంగళ కాలనీ, తొగట కాలనీ వాసులతో కలిసి స్వర్గీయ మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పెద్దాయన పాలకొండ్రాయుడు రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచారన్నారు. పాలకొండ రాయుడుతో తమకున్న అనుబంధాన్ని కొత్తపేట రామా పురం వార్డు ప్రజలు పాత రోజులను గుర్తు చేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. తన తండ్రి వేసిన అడుగుజాడల్లోనే ముందుకు వెళ్లి బడుగు, బలహీన వర్గాలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ మీకు ఏ అవసరం వచ్చినా నేనుంటానంటూ భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పెరికల రెడ్డన్న, శ్రీనివాసులు, తుమ్మగింజల వెంకటరమణ, కౌన్సిలర్ భాస్కర్, మాజీ కౌన్సిలర్ రాంమోహన్, గుట్టబాబు, జయసింహారెడ్డి, సుబ్బారెడ్డి, గుండ్లపల్లి వెంకటేసు, రిటైర్డ్ కానిస్టేబుల్ నాగభూషణం, ఎల్ఐసి శ్రీనివాసులు, గున్నికుంట్ల బలరాం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసాద్‌బాబు

పేదలకు వరం సిఎం సహాయనిధి

- ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా 28 మందికి బాధితులకు రూ.30.80లక్షలు సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో అత్యవసరంగా అప్పులు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు సిఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న మధ్య తరగతి, పేద కుటుం బాలకు సహాయాన్ని అందించి ఆదుకుంటుందని అన్నారు. వైద్య చికిత్స కోసం కొంతమేరకు ఆర్థిక సాయం అందిస్తుందని అన్నారు. నియో జకవ ర్గంలో ఏ ఒక్కరు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదని ఆశయంతో తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ప్రయి వేట్ వైద్యశాలల్లో లక్షల ఖర్చు చేసి వైద్యం చేయించుకున్న లబ్ధిదారులకు ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఇబ్బందుల్లో ఉన్న ప్రజల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సహాయ సహకారాలు అందించడానికి అందరికి అందుబాటులో ఉంటానన్నారు.

బాధితులకు చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి నగిరిపల్లిలోని తమ నివాసంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలు చెప్పుకుని అర్జీలు అందించారు. గతంలో భూ వివాదాలు, కారణంగా వివిధ సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో చర్చించి సమస్యల పరిష్కరించాలని ఆదేశించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

వృద్ధులకు ఇంటి వద్దకే సరుకులు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

65 సంవత్సరాల పైబడిన వారికి, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేస్తారని వారు రేషన్ షాపుల వద్దకు రావాల్సిన అవసరం లేదని కలెక్టర్ శ్రీధర్ అన్నారు. జిల్లాలో జూన్ మాసం మొదటి 03 రోజులలోనే వికలాంగులు, 65 సంవ త్సరాల పైబడిన వారి మొత్తం కార్డులలో 57.79 శాతం కార్డులకు రేషన్ సరుకుల పంపిణీ పూర్తయిందని చెప్పారు. మంగళవారం జిల్లాలో చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ పై విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1123 చౌక ధరల దుకాణాలు ఉన్నాయని, మొత్తం రేషన్ కార్డులు 4,97,969 ఉన్నాయని, మొత్తం రేషన్ కార్డుల ద్వారా 14,82,094 మంది సభ్యులు రేషన్ ద్వారా లబ్ది పొందనున్నారని పేర్కొన్నారు. ఇందులో 65 సంవత్సరాల పైబడిన కార్డుల సంఖ్య 53,707గా ఉందని, ఈ కార్డుల ద్వారా 69,336 మంది సభ్యులు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. ప్రతినెలా 01 నుండి 15 వరకు ఉదయం 8 నుండి 12 గంటల వరకు సాయంత్రం 04 నుండి 08 గంటల వరకు రేషన్ పంపిణీ చేస్తారని చెప్పారు. ఏక లేదా ద్విసభ్య కార్డులలోని వారి వయస్సు 65 సంవత్సరాల పైబడి వారికి, విభిన్న ప్రతిభావంతులకు వారి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ 1 నుండి 05వ తేదీ వరకు 12 గంటల నుండి 4 గంటల మధ్య సమయంలో పంపిణీ చేస్తారన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం పాల్గొన్నారు.

తాళ్లపాకలో 7న యోగాంధ్ర

ప్రజాశక్తి-రాయచోటి : ఈ నెల 7న తాళ్ళపాక అన్నమయ్య సన్నిధిలో అత్యంత వేడుకగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి తెలుగు ప్రముఖ వాగ్గేయకారుడు పదకవితా పితామహుడు తిరుమలేశునిపై 32వేల సంకీర్తనలు రచించి సంకీర్తనాచార్యుడు అన్నమయ్య నడయాడిన నేలలో ఆయన పేరుతో అన్నమయ్య జిల్లా ఏర్పడిందన్నారు. ఈ ఏడాది మే 9న 617 వసంతాలు పూర్తి చేసుకున్న శ్రీ అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకొని ఆయనను స్మరిస్తూ తాళ్లపాకలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఈనెల 7న ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు 617 మందితో యోగాసనాలు వేయనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో 32 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ర్యాలీ చేస్తున్న కిశోర బాలికలు

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

నాయకత్వ లక్షణాలను కౌమార దశ నుంచే అలవర్చుకోవాలని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి, కసిరెడ్డిగారిపల్లి సచివాలయంలో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి జీవితంలో కౌమార దశ చాలా ప్రాముఖ్యమైనదని అన్నా రు. ఆ వయసులో ఎలాంటి అలవాట్లు, నిర్ణయాలు తీసుకుంటారో జీవితంలో అలా సాగిపోతుందని తెలిపారు. కౌమారదశలో మంచి నడవడికతో లక్ష్యాలను నిర్ణయించుకుని ముందుకు సాగాలని సూచారు. చదువు తోపా టుగా సమాజంలో ఎలా మెల గాలి, కుటుంబాన్ని ముందు తీసుకో వాలంటే ఎలాంటి నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలనే అంశాలకు వివరించారు.పర్యా వరణాన్ని ఎలా కాపాడుకోవాలి అనే అంశాలపై అవగా హన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల వద్ద మొక్కలునాటి ఆ మొక్క లకు పిల్లల పేర్లు లేదా తల్లిదండ్రుల పేర్లు పెట్టి వాటికి నీరు పోసి బాగా రక్షణ కల్పించి చెట్లు అయ్యేలా పెంచాలన్నారు. శరీరానికి కావాల్సిన వ్యాయామలలో యోగ ఒకటని పిల్లలతో యోగా చేసే విధానాన్ని నేర్పించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్ర మంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ, పద్మజారాణి, సుజాత, జిఎం ఎస్‌కె రజిని, అంగన్వాడీ కార్యకర్త వెంకటశివజ్యోతి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రైతులతో సందడిగా ఎపిజిబి

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రైతులతో సందడిగా నిండిపోయింది. మండలంలో 17 గ్రామాల్లో 2124 మంది రైతులు పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ఏప్రిల్ నెల నుంచి ఇక్కడ రుణాలు ప్రారంభించారు. ఆగస్టు వరకు రుణ ప్రక్రియ కొనసాగుతుందని బ్యాంకు అధికారులు తెలిపారు. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యేందుకు రుణాల కోసం బ్యాంకు వచ్చినట్లు రైతులు తెలిపారు.

రాఘవరెడ్డి, రమణనాయక్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రంలోని తపాలా శాఖలో మంగళవారం బదిలీపై వెళ్తున్న పోస్టల్ అసిస్టెంట్ ఎ.రాఘవరెడ్డిని, విధుల్లో చేరుతున్న నూతన పోస్టల్ అసిస్టెంట్ రమణనాయక్‌ను మంగళవారం సిబ్బంది దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. రాఘవరెడ్డి గత మూడు సంవత్సరాలుగా తపాల శాఖలో పనిచేసే బదిలీపై రాయచోటి ఇన్స్‌పెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారని ఎస్‌పిఎంఎం దొరస్వామి నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది రమణ, బుజ్జమ్మ, నాగరాణి, లోకేష్, సింగం. రవి, నాగిరెడ్డి, నారాయణ, అపర్ణ, బిపిఎంలు, ఎబిపిఎంలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఉపాధి' పనులు

ప్రజాశక్తి-కలకడ

మండలంలో ఉపాధి పనులను ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపిడిఒ అబ్దుల్ రహీం, ఎపిఒ సుజాత పిలుపుమేరకు ఉపాధి కూలీలు తమ పనులను చేసిన అనంతరం యోగాంధ్రలో భాగంగా యోగాసనాలు వేశారు.

ఖనిజ నిక్షేపాల కోసం శోధన

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సీతారామాపురం, కుచ్చుపాప, నరహరిపురం, అనంతపురం గ్రామాల పరిధిలో పంట పొలాల్లో ఖనిజ నిక్షేపాల కోసం శోధన చేపడుతున్నారు. భూమిలో బోర్లు, ఫిల్టర్ల ద్వారా రిగ్గు వేసి ఖనిజాలను అన్వేషిస్తున్నారు. పది రోజులుగా వందల సంఖ్యలో బోర్లు వేసే వాహనాలతో పరిశోధన చేస్తున్నారు. ఆయిల్ ఖనిజాలు, ఇతర ముడి ఖనిజాలు అందుబాటులో ఉంటాయన్న అంచనాతో పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎకరాలో 20 నుంచి 30 వరకు బోర్లు వేస్తూ వెంటనే వాటిని పూడ్చి వేస్తున్నారు. కొన్ని ప్రత్యేకమైన యంత్రాలతో బోర్లు వేసిన అనంతరం తరంగాలను రికార్డు చేసుకుంటూ బోరు గుంతలను పూడ్చివేస్తున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

శాఖ గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలను నిర్వ హించారు. ఈ సందర్భంగా గ్రం థాలయ అధికారి జె శివ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజూ ఒక కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నా మన్నారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించి శిక్షణా తరగతులలో చివరి రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. గ్రం థాలయ సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పుష్పగిరిలో పురాతన మృత్యుంజయ స్వామి విగ్రహం గుర్తింపు

ప్రజాశక్తి - వల్లూరు

మండలంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన దక్షిణ కాశీ అయిన పంచమ నది పుణ్యక్షేత్రం పుష్పగిరి శ్రీవైద్య నాథస్వామి దేవాల యానికి అతి సమీపంలోని పురాతనమైన శ్రీమృత్యుంజయ స్వామి విగ్ర హం ఉండడాన్ని గుర్తించినట్లు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మంగళవారం మీడియాకు తెలిపారు. శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి దేవాలయం కొండ నుంచి ఖాజీపేటకు వెళ్లే రహదారిలో చింతలపత్తూరుకు అతి సమీపంలో ఓ దుర్గ గుడి ఉండేదన్నారు. ఆ గుడి ప్రాంగణంలో బహిర్గతంగా సుమారు 15 సంవత్సరాల క్రితం ఒక శివుని విగ్రహం, పానమట్టం ఉండేవని తెలిపారు. వాటిని పుష్పగిరి ప్రాంతానికి చెందిన కురుమద్ది రమణమూర్తి, గ్రామస్తులు కట్టెపుల్లలు తెచ్చుకోవడానికి వెళ్లిన సమయంలో రమణమూర్తి ఆ విగ్రహాన్ని, పానమట్టం కనుగొని అక్కడి నుంచి శ్రీ వైద్య నాదస్వామీ ఆలయ సమీపంలో ఉండే పాతాళ గణపతి ఆలయ ప్రాంగణంలోకి చేర్చారు. ఆ విగ్రహానికి రమణమూర్తి మృత్యుంజయ స్వామి అని పేరు పెట్టినట్లు రచయిత వివరించారు. విగ్రహం విషయాల గురించి రమణమూర్తి బంధువు రాజేష్ తనకు చెప్పారని రచయిత వెల్లడించారు. దీనిపై మరింత పరిశోధన చేయనున్నట్లు రచయిత తెలిపారు.

ఉత్తమ అధ్యాపకుడిగా ప్రభాకర్ ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపుల పాయ క్యాంపస్‌లో ఉన్న ఒంగోలు ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న డాక్టర్ విరూపాక్షి ప్రభాకర్ ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైనట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. ఎనిమిదేళ్ల నుంచి కెమిస్ట్రీ విభా గంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనకు ఈనెల 25న హైదరాబాదులోని వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ వారు బెస్ట్ టీచర్‌గా అవార్డు ప్రదానం చేయ నున్నట్లు తెలిపారు. పరిపాలన అధికారి రవికుమార్, కెమిస్ట్రీ విభాగ అధ్యాపక బృందం, అధ్యాపకులు, విద్యార్థులు, హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

మౌలిక వసతులకు నోచని వంటిల్లు దళితవాడ

- రోడ్లపైనే నిలిచిన వర్షపునీరు
- రోడ్డుపై అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభంతో అవస్థలు
- పట్టని అధికారులు

రోడ్డుపై ఉన్న మురుగునీటి చూపుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పరాజుపేట గ్రామపంచాయతీ, వంటిల్లు దళితవాడలో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో రోడ్డు తక్కువ ఉండడం వల్ల వర్షం వచ్చిందంటే రోడ్డు మీదే నిలిచిపోతున్నాయని తెలిపారు. రోడ్లపై నీరు నిలిచి ఉండటంతో దోమలు స్వైర విహారం చేయడంతో మలేరియా, డెంగీ వంటి విష జ్వరాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. గ్రామ మంతా మురికి మయంగా మారినా అధికారులు ఎవరు స్పందించడం లేదని తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో సిమెంట్ రోడ్డును ఎత్తుగా వేసి పక్కన డ్రెనేజీ కాలువలను ఏర్పాటు చేస్తే నీరు నిల్వ లేకుండా ఉంటాయని తెలిపారు. విద్యుత్ స్తంభం కూడా రోడ్డుకు అడ్డంగా ఉందని, ఆ స్తంభం వల్ల వాహనదారులకు, గ్రామ ప్రజలకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేస్తున్నారని దళితులు నివసించే ఈ గ్రామం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ గ్రామంలో సిమెంట్ రోడ్డును వేయాలని, విద్యుత్ శాఖ అధికారులు రోడ్డుకు అడ్డంగా మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి మరోపక్క ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

క్షయ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

టిబిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- నిమ్మనపల్లి

క్షయ రహిత సమాజం కోసం అందరం బాధ్యత తీసుకొని కృషి చేద్దామని నిమ్మనపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ ప్రత్యూష పేర్కొన్నారు. మంగళవారం ఆశా డేను సందర్భంగా టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలను ముందస్తుగా గుర్తించి అవగాహన కల్పిస్తే టిబి వ్యాధిని అంతం చేయడం సాధ్యమవుతుందని అన్నారు. ప్రజల్లో ఆరోగ్యకర అలవాట్లుపై అవగాహన కల్పిస్తూ పోషకాహార లోపాలను అధిగమించాలన్నారు. మధుమేహం, హెచ్ఐవి, ధూమపానం, మద్యపానం, మలేరియా, డెంగీ వంటి వ్యాధులపై ప్రచారం చేయా లన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు సకాలంలో టీకాలు వేయాలన్నారు. టిబి వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులను గుర్తించి పరీక్షలు నిర్వహించాలన్నారు. అప్పుడే వ్యాధులు, మరణాలు భారీగా తగ్గి 2030 నాటికి టిబి రహిత భారత దేశం సాధ్యపడుతుందని అన్నారు. టిబి అంతం అందరి పంతం అన్న నినాదాలతో ర్యాలీ నిర్వహించి, వైద్య ఆరోగ్య సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ ప్రత్యూష, సిహెచ్ఒ, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతగా మధ్యాహ్న భోజనం : ఎంఇఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ప్రభుత్వ పాఠశాలలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత నాణ్యతగా అందించాలని ఎంఇఒ నారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలోని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక శిక్షకులగా జడ్‌పి హైస్కూల్ అంగళ్లకు చెందిన పి.చంద్రకళ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం నిర్వహకులు, సహాయకులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అంకితభావంతో రుచికరంగా, నాణ్యతగా భోజనాన్ని అందించి ఆరోగ్య అభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. పాఠశాల విద్యాశాఖ నియమ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజన తయారీలో కూరగాయలను, వంటకు మంచి సామగ్రిని ఉపయోగించి పరిశుభ్రతను పాటించి శుభ్రంగా భోజనం తయారు చేసి పెట్టాలన్నారు. పాఠశాలలో ప్రతిరోజు మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని, ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం, కోడిగుడ్లు, చిక్కీలు, రాగి పిండి, బెల్లం మొదలైన పదార్థాలను పరిశీలించి మంచిస్థితిలో ఉన్న వాటినే ఉపయోగించాలన్నారు. వంట నిర్వాహకులు తప్పకుండా వ్యక్తిగత శుభ్రతతో వంట తయారు చేయాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు తయారుచేసిన భోజనాల రుచులను పరిశీలించారు. భోజనాన్ని రుచిగా నాణ్యతగా తయారు చేసిన పి.జయమ్మ, జడ్‌పిహెచ్ఎస్ నిమ్మనపల్లి (తెలుగు)కు మొదటి బహుమతి, కె.రెడ్డమ్మ తవళం ప్రాథమికోన్నత పాఠశాలకు రెండవ బహుమతి, ఇ.శాంతమ్మ, ప్రాథమిక పాఠశాల యర్రంవారిపల్లెకు మూడవ బహుమతిని ప్రదానం చేశారు. నాణ్యతలో రాజీ లేకుండా విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలన్నారు. అనంతరం 2025-26 నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యా సామగ్రి కిట్లను మండలంలోని అన్ని పాఠశాలలో సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ నరసింహులు పాల్గొన్నారు.

నందలూరు : మాట్లాడుతున్న డిఇఒ నాగయ్య

నందలూరు : మండలంలో మధ్యాహ్న భోజనం వంట చేసేవారికి నాగిరెడ్డిపల్లి హైస్కూల్‌లో వంటల పోటీలను ఎంఇఒ-2 సిఆర్ అనంతకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నందలూరు ఎంఇఒ నాగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకంలో పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారాన్ని , రుచికి తగినట్టుగా అనేక రకాల ఆహార పదార్థాలు మెనూలో చేర్చబడ్డాయని అన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సూచించారు.కార్యక్రమంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు ముజఫర్ అహ్మద్ ,అమరావతి ,వెంకట నరసమ్మ, రేవతి, సాంబశివ ,మాలతి ,అవ్వరు వెంకటసుబ్బయ్య

మెరుగైన వైద్య సేవలు అందించండి :డిసిహెచ్ఎస్

ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డిసిహెచ్ఎస్ ఆంజనేయులు

ప్రజాశక్తి-కలికిరి

ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ ఆంజనేయులు వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఒపి, ఐపి, డెలివరీలు, ఇహెచ్అర్, ఎన్టీఆర్ వైద్య సేవ, ల్యాబ్, ఫార్మసీ, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, డైట్ రికార్డులను తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్, ఎన్టీఆర్ వైద్యసేవను మెరుగు పరచమని ఆదేశించారు. కొత్త భవనాన్ని పరిశీలించారు. కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఆసుపత్రి లో 5బెడ్స్ ప్రత్యేకంగా కరోనా రోగుల కోసం కేటాయించాలని ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వై.పవన్‌కుమార్‌ను ఆదేశించారు.ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కొత్త భవనంలో మాత శిశు వైద్య సేవలు, ఎక్స్ రే, ల్యాబ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పాము కాటుకు, కుక్క కాటుకి సంబంధించన మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. హార్ట్ ఎటాక్ కి సంబంధించిన నలభై వేలు విలువ చేసే టెనెక్టప్లేస్ ఇంజెక్షన్ అందుబాటులో ఉందని, గుండె నొప్పి వచ్చినప్పుడు ఇసిజి తీసుకొని అవసరమైతే వైద్యులు ఆ ఇంజెక్షన్ ఇస్తారని, ఈ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో డాక్టర్ ఆశాలత, డాక్టర్ అన్వేష్, డాక్టర్ సిమ్రన్, డాక్టర్ ఆశ్రిత, ఇంచార్జ్ హెడ్ సిస్టర్ ఉమా మహేశ్వరి, ఫార్మసిస్ట్ మొయినుద్దీన్, రేడియోగ్రాఫర్ వెంకటరమణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు, స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం లక్కిరెడ్డిపల్లి పొలంలోని 705 సర్వే నెంబర్లు2.2 ఎకరాల భూమిలో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 705 సర్వేనెంబర్ లో 2.2 ఎకరాల భూమిని సూర్యనారాయణ రెడ్డికి అనే వ్యక్తికి డికెట్ భూమి ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ఆ భూమిని ఇప్పటికే ముగ్గురికి విక్రయిం చారని ప్రభుత్వం ఇచ్చిన డికెట్ భూమిని ఎవరికి విక్రయించకూడదని చుట్టు ప్రకారం డికెటి పట్టా భూమిని ఇతరులకు విక్రయించడంతో ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ప్రభు త్వ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలి పారు.కార్యక్రమంలో ఆర్ఐ రాజేష్, విఆర్ఒ కృష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులు

మొక్కజొన్న సాగు.. ఆదాయం బాగు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల వ్యాప్తంగా రైతులు మొక్కజొన్న పంట సాగు వైపు దృష్టి సారించారు. వరితోపాటు ఇతర పంటలకు పెట్టుబడి ఖర్చులు పెరి గాయి. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో మొక్కజొన్నను విస్తారంగా సాగు చేశారు. మండల పరిధిలోని కొత్తపేట, కొత్త నెల్లూరు, చెన్నముక్కపల్లె, నాగసానిపల్లి తదితర గ్రామాల్లో మొక్కజొన్న రైతులు విస్తారంగా సాగు చేశారు. ఎకరాకు 40 క్వింటళ్ల దిగుబడి వస్తుందని, రూ.80 వేల వరకు వస్తుండగా పెట్టుబడి ఖర్చు పోనూ ఎకరాకు రూ.45 వేల వరకు ఆదాయం సమకూరుతుందని రైతులు పేర్కొంటున్నారు. పంట కాలం కూడా మూడున్నర నెలలు మాత్రమే. ఈ కారణంగా మొక్కజొన్నను అధికంగా సాగు చేస్తున్నామని ఆంజనేయపురం రైతులు పేర్కొంటున్నారు.

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఖాజీపేట : ప్రతి ఒక్కరూ పరిసరాలుశుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అయేషా సూచించారు. అపరిశుభ్రత కారణంగా వ్యాధులు సోకుతాయని అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతపై దృష్టి పెట్టేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు.


లీలా కృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అతికారి కృష్ణ

లీలా కృష్ణను కలిసిన అతికారి కృష్ణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా మండపేట జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణను విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సమగ్ర జలవనరుల నిర్వహణ, రైతు శిక్షణ కేంద్రంలో అన్నమయ్య జిల్లా జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ గరికిపాటి శివశంకర్, నాయకులు కె.ఎస్ నరసింహ, జోగినేని మణి, కోలా సోమశేఖర్, పోతుల సాయినాథ్, గడేకుల రమణ, పసుపులేటి గంగయ్య, గంగాధర్, హరిప్రసాద్, గోపీనాథ్, మణికుమార్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాకూ.. నాబిడ్డకు న్యాయం చేయండి

-పోలీసులను ఆశ్రయించిన ఓ మహిళ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

కొడుకుతో సౌజన్య

తనను, తనబిడ్డను తన భర్త స్వీకరించేలా పోలీసు అధికారులు న్యాయం చేయాలని సౌజన్య అనే మహిళ పోలీసులను వేడుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కెఎస్ఆర్‌పల్లె పంచాయతీలోని చాగల7 గొట్టపల్లికు చెందిన దేరంగుల సౌజన్య ఆరేళ్ల క్రితం మట్లి గ్రామానికి చెందిన మడితాటి మహేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి, ఇద్దరూ హైదరాబాదుకు వెళ్లి కొన్ని సంవత్సరాలుగా అక్కడే ఉంటూ 2023లో పెళ్లి చేసుకున్నట్లు తెలిపింది. మా ఇద్దరికీ 2024 ఆగస్టులో హైదరాబాదులో ఉన్నప్పుడు ఒక బాబు జన్మించాడని చెప్పింది. ఆస్పత్రిలో తన బిడ్డకు తండ్రి మహేశ్వర్‌రెడ్డేనని అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఈ మధ్యకాలంలో రెండు నెలల క్రితం డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని, బిడ్డ మాత్రమే కావాలి తనను వద్దంటున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. మహేశ్వర్‌రెడ్డి అగ్రవర్ణాల కులానికి చెందినవాడని, తాను బిసి కులానికి చెందిన వ్యక్తి కావడంతో కుల వివక్షకు గురవుతున్నాని చెప్పింది. తనకు తన భర్త కావాలంటూ రెండు రోజుల క్రితం రాయచోటిలో ఎస్‌పి విద్యాసాగం నాయుడును కలిసి న్యాయం కోరగా లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ పంపించారని తెలిపారు. లక్కిరెడ్డిపల్లె పోలీసులు మహేశ్వరెడ్డి తనను, తనబిడ్డను స్వీకరించేలా చేయాలని కోరారు. తనకు న్యాయం జరగకపోతే నాకు, నాబిడ్డకు ఆత్మహత్యే శరణ్యమని వేడుకుంది. ఈ విషయంపై లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ రవీంద్రను వివరణ కోరగా విచారణ చేసి బాధితురాలకు న్యాయం చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లి పట్టణం, బడికాయ పల్లి, లక్ష్మీనగర్‌కు చెందిన కె.నారాయణ(69), మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లెలో నివాసముంటున్న తన బంధువుల ఇంటికి వచ్చినట్టు తెలిపారు. బంధువుల ఇంటి నుంచి మంగళవారం తెల్లవారుజామున తన స్వగ్రామం మదనపల్లికి వెళ్లడానికి కలకడ బస్టాండ్‌కు నడిచి వెళుతుండగా వెనుక వైపు నుంచి ఎర్రగుంట్ల నుంచి చిత్తూరుకు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ నారాయణను ఢీకొన్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. 108 వాహనం వచ్చేసరికి ప్రమాదానికి గురైన నారాయణ మృతి చెందినట్లు 108 సిబ్బంది డ్రైవర్ శ్రీనివాసులు, వెంకటాచలపతి తెలిపారని అన్నారు. సంఘటన జరిగిన వెంటనే లారీతో సహా డ్రైవర్ పరారీ అయ్యారని తెలిపారు. కలకడ పోలీసులు సిసి కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పీలేరు వైపు వెళ్తున్న సిమెంట్ లారీని పీలేరు వద్ద గుర్తించి, లారీని అదుపులోకి తీసుకొని ఎర్రగుంట్లకు చెందిన లారీడ్రైవర్ దర్శన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిల్లి కోసం ఘర్షణ : ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లి చనిపోవడంతో దానికి నువ్వంటే నువ్వే కారణమని రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో ఆరుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని సీతారాంపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..సీతారాంపేట గ్రామంలో గంగమ్మ జాతర నిర్వహిస్తుండడంతో ఆ జాతరలో తినుబండారాలు అమ్ముకునేందుకు వచ్చిన పూసలువారు వేసిన ఉచ్చులో పాల పురుషోత్తం అనే వ్యక్తి పెంచుకున్న పిల్లి అందులో చిక్కుకొని మృతి చెందిందని తెలిపారు. దానికి పూసల వారే కారణమని వారితో గొడవ పడుతుండగా అదే గ్రామానికి చెందిన ఉమ్మడి నరేంద్ర, అతని అనుచరులు వారి తప్పేమీ లేదని వాదించడంతో రెండు గ్రూపుల్లోని పాలా పురుషోత్తం, కృష్ణమూర్తి ,కేశవ ప్రసాద్, గణపతి, సుబ్బయ్య, ఉమ్మడి నరేంద్ర, బర్రెకుల సుబ్బయ్య, గుర్రం సుబ్బరాయుడు, గుర్రం పెంచ లయ్య, జ్ఞానేంద్ర ఒకరినొకరు తీవ్రంగా దాడి చేసుకున్నారని తెలిపారు. పాల పురుషోత్తం అనుచరుల్లో ముగ్గురు, ఉమ్మడి నరేంద్ర గ్రూపులో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇరు గ్రూపులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

ఆటో బోల్తా

- ఒకే కుటుంబంలోని వ్యక్తులందరికీ గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని రామక్కపల్లె సమీపంలో ఆటోబోల్తా పడటంతో కుటుంబం మొత్తం తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల వివరాల మేరకు.. కడప జిల్లా, జమ్మలమడుగు పట్టణానికి చెందిన పికె.రామయ్యా కుటుంబం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి బయలుదేరి దర్శనం చేసుకుని తిరిగి తమ స్వగ్రామానికి బయలుదేరారని తెలిపారు. రామక్కపల్లె సమీపంలో కడప-రేణిగుంట జాతీయ రహదారిపై ఆటో స్టీరింగ్ పట్టేయడంతో ఎదురుగా ఉన్న రైల్వే దిమ్మెకు ఢీకొని ఆటో బోల్తా పడిందన్నారు. ఆటోలో ఉన్న మొత్తం కుటుంబం చిన్న పాపతో సహా తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని రైల్వేకోడూరు వైసిపి పట్టణ అధ్యక్షులు సిహెచ్ రమేష్‌బాబు, రాయలసీమ బూత్ కన్వీనర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, గల్లా శ్రీనివాసులు వెంటనే వారిని ఆటో నుంచి బయటికి తీసి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలిస్తున్న వైసిపి నాయకులు